మంగళవారం లగచర్ల బాధితులు నందినగర్‌లోని నివాసంలో తనను కలిసి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు విరాళంగా రూ.లక్ష చెక్కును అందజేసిన నేపథ్యంలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో కొప్పుల ఈశ్వర్, పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

# సీఎం.. సిగ్గుంటే రాజీనామా చెయ్!

- లగచర్ల రైతులకు క్షమాపణ చెప్ప
- సర్కారుకు హెచ్ఆర్సీ నివేదిక చెంపపెట్టు
- రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా పోలీసులు
- ఆ పోలీసులందరినీ డిస్మిస్ చేయాల్సిందే
- కమిషన్ ఆదేశాలను అమలు చేయాలి
- లేదంటే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రజతోత్సవ సభకు లగచర్ల వాసుల విరాళం
- కేటీఆర్‌కు రూ.లక్ష చెక్కు అందజేత
- వారికి కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ‘లగచర్ల ఎస్సీ, ఎస్టీ రైతులను అక్రమంగా అరెస్టు చేశారు. స్టేషన్‌కు తీసుకెళ్లి కేసులు నమోదు చేయకుండా చిత్రహింసలు పెట్టారు. బెదిరింపులకు పాల్పడ్డారు. లగచర్ల ఆడబిడ్డలను లైంగికంగా వేధించారు. మానవ హక్కులను ఉల్లంఘించి పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని స్వయంగా జాతీయ మానవ హక్కుల కమిషనే తన నివేదికలో వెల్లడించింది. స్థానిక ఎమ్మెల్యేగా, హోం మినిస్టర్‌గా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి ఏమాత్రం సిగ్గున్నా తక్షణం రాజీనామా చేయాలి’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసులను విధుల నుంచి డిస్మిస్ చేయాలని, లేదంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు. న్యాయం జరిగేవరకూ లగచర్ల బాధితులకు అండగా నిలబడతామని స్పష్టంచేశారు. ఎన్‌హెచ్చార్సీ నివేదిక నేపథ్యంలో లగచర్ల, హకీంపేట గ్రామస్థులు నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను మంగళవారం కలిశారు. బీఆర్ఎస్ సభకు లగచర్ల తరపున రూ.లక్ష చెక్కును విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. లగచర్లలో దళిత, గిరిజన ఆడబిడ్డలపై పోలీసులు లైంగిక వేధింపులకు, హింసకు పాల్పడ్డారని ఎన్‌హెచ్చార్సీ తేల్చిన నేపథ్యంలో దీనికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేండ్లలో మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుందని, ఓవరాక్షన్ చేస్తున్న పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఎన్‌హెచ్ఆర్సీ నివేదికతోనైనా సిగ్గు తెచ్చుకుని రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి మానవత్వం ఉంటే దళిత గిరిజనులపై జరిగిన అరాచకాలు, లైంగిక వేధింపులకు బాధ్యత వహించి రాజీనామా చేసి క్షమాపణ కోరేవారని, అవేవీ లేనందునే ఇంకా సీఎంగా కొనసాగుతున్నారని కేటీఆర్ విమర్శించారు.

### లగచర్ల గిరిజనులకు కృతజ్ఞతలు

బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం లగచర్ల గిరిజనులు లక్ష రూపాయల విరాళం ఇవ్వడం సంతోషంగా ఉన్నదని కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. లగచర్ల గిరిజనులను పోలీసులు దారుణంగా హింసించారని నిప్పులు చెరిగారు. అత్యంత కిరాతకంగా మానవ మృగాల మాదిరిగా కొందరు పోలీసులు రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారని, లగచర్ల ఆడబిడ్డలతో అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు. బాధితుల తరపున ప్రశ్నించిన తమ నాయకుడు నరేందర్‌రెడ్డిని సైతం 37 రోజులు అక్రమంగా జైల్లో పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ దమనకాండకు బలైన లగచర్ల రైతులు తెలంగాణ భవన్‌కు వస్తే న్యాయం దక్కేలా చూస్తామని బీఆర్ఎస్ తరపున మాటిచ్చామని, ఢిల్లీ దాకా తీసుకెళ్లి మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌ను కలిశామని, రేవంత్ సర్కారు చేసిన దుర్మార్గాలను దేశం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దేశంలో ఇంకా న్యాయం, ధర్మం బతికే ఉన్నాయని, మానవత్వం మిగిలే ఉన్నదని ఎన్‌హెచ్చార్సీ నివేదికతో స్పష్టమైందని వివరించారు. ప్రస్తుతం హెచ్‌సీయూ భూముల విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థిక మోసానికి పాల్పడిందంటూ కేంద్ర సాధికార కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు.

> బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం లగచర్ల గిరిజనులు లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వడం గుండె నిండా సంతోషాన్ని నింపింది. వాళ్లు కష్టంలో ఉన్నవేళ బీఆర్ఎస్ అండగా ఉన్నదని, అందుకే ఉడతా భక్తిగా సాయం చేస్తున్నమని లగచర్ల గిరిజనులు ముందుకు రావడం గొప్పవిషయం. ఒక మనిషిని ఎన్ని రకాలుగా శారీరకంగా చిత్రవధ చేసే అవకాశం ఉంటదో అన్ని రకాలుగా లగచర్ల గిరిజనులను పోలీసులు హింసించిండ్రు. రైతు హీర్యానాయక్‌కు ఛాతిల నొప్పి వచ్చినా మానవత్వం చూపకుండా బేడీలు వేసి దవాఖానకు తీస్కపోయిన నికృష్ట ప్రభుత్వం రేవంత్‌రెడ్డిది.
>
> - కేటీఆర్

### బాధ్యులను డిస్మిస్ చెయ్యాలి

లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్చార్సీ ఇచ్చిన కీలకమైన రిపోర్ట్‌ను మీడియా పెద్దగా పట్టించుకోలేదని కేటీఆర్ తెలిపారు. నివేదికలోని కొన్ని అంశాలను ఈ సందర్భంగా చదివి వినిపించారు. తనను, తన అత్తను కూడా లైంగికంగా వేధించారని లగచర్లకు చెందిన ఒక అమ్మాయి, చెప్పరాని చోట కొట్టారని మరో అమ్మాయి ఎన్‌హెచ్చార్సీ ఎదుట చెప్పారని, దేశంలో ఏ ఆడపిల్లా ఇలాంటి విషయాల్లో అబద్ధాలు చెప్పదని గుర్తుచేశారు. పరిగి పోలీస్ స్టేషన్లో రైతులను విపరీతంగా కొట్టడమే కాకుండా మెజిస్ట్రేట్‌కు చెప్తే ఇంట్లో వాళ్లను కూడా తీసుకొచ్చి కొడతామని పోలీసులు బెదిరించారని, ఘటన జరిగిన రోజున అక్కడ లేని వ్యక్తులను, సంబంధం లేని రైతులను కూడా తీసుకొచ్చి చిత్రహింసలు పెట్టారని కమిషన్ నివేదించినట్టు వివరించారు. లాకప్పుల్లోని సీసీ టీవీలు పనిచేస్తలేవని చెప్పడం ప్రభుత్వ దమనకాండకు నిదర్శనమని నివేదిక తెలిపిందని వివరించారు. ఈ చర్యలన్నింటికీ బాధ్యులైన పోలీసులపై 6 వారాల్లో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కమిషన్ ఆదేశించిందని, లేదంటే తామే తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించిందని వెల్లడించారు. కమిషన్ ఆదేశాలను ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో రేవంత్‌రెడ్డి, ఆయన అన్న తిరుపతిరెడ్డి పాత్ర లేకపోతే ఓవరాక్షన్ చేసిన పోలీసులను సర్వీస్ నుంచి తొలగించాలని, లేదంటే లగచర్ల ఘటనకు కర్త, కర్మ, క్రియ రేవంత్‌రెడ్డే అనుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు.

### హిసాబ్ కితాబ్ బరాబర్ చేస్తం

లగచర్లలో భూసేకరణ కూడా తప్పుడు పద్ధతిలో చేశారని ఎన్‌హెచ్చార్సీ తన నివేదికలో స్పష్టం చేసిందని కేటీఆర్ వెల్లడించారు. భూ సేకరణపై హైకోర్టులో స్టే ఉన్నా ప్రభుత్వం ఇప్పటికీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నదని, చాటుమాటుగా పనులు చేస్తున్నట్టు తమకు సమాచారం ఉన్నదని చెప్పారు. పోలీసులు, అధికారులు ఇప్పటికీ బెదిరిస్తున్నట్టు లగచర్ల బాధితులు చెప్తున్నారని వివరించారు. ఓవరాక్షన్ చేస్తున్న అధికారులను తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టేది లేదని, హిసాబ్ కితాబ్ బరాబర్ చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ చెప్పినా, హైకోర్టులో స్టే ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు చేస్తున్న అధికారులకు వారి పద్ధతిలోనే జవాబు చెప్పాల్సి వస్తుందని తెలిపారు. లగచర్ల బాధితులకు గతంలో అన్నివేళలా అండగా ఉన్నామని, వాళ్లకు న్యాయం జరిగేదాకా అండగా ఉంటామని, రేవంత్ ప్రభుత్వానికి బుద్ధి వచ్చేదాకా కొట్లాడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. ఇంత కష్టంలో కూడా బీఆర్ఎస్ గురించి ఆలోచించి, రజతోత్సవ సభకు విరాళమిచ్చిన లగచర్ల ఆడబిడ్డలకు చేతులు జోడించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

### రజతోత్సవ సభకు లగచర్ల లక్ష విరాళం

వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లగచర్ల గ్రామస్తులు రూ.లక్ష విరాళం అందజేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా భూసేకరణ చేపట్టడంపై కొడంగల్ మండలం లగచర్ల, పోలెపల్లి, హకీంపేట, రోటిబండతండా, పులిచెర్లకుంట తండా, పోలెపల్లి తండా, పోలెపల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వారిపై పోలీసులు దాడి చేయడం, 55 మందిపై కేసులు నమోదు చేయడం, 16 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. ఈ క్రమంలో వేలాది మంది పోలీసులు లగచర్లపై మూకుమ్మడిగా దాడి చేయడం తోపాటు, రైతులు, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా కేసులు నమోదు చేసి, స్టేషన్లకు తరలించిన చిత్రహింసలు పెట్టిన సంగతి విదితమే. ఈ క్రమంలో లగచర్ల రైతులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. వారి గోడును యావత్ దేశానికి వినిపించింది. న్యాయ పోరాటానికి మద్దతుగా నిలిచింది. ఢిల్లీకి తీసుకెళ్లింది. జైలుకు వెళ్లిన వారు తిరిగొచ్చేదాకా భరోసాగా నిలిచింది. అన్నివిధాలా అండగా నిలిచిన బీఆర్ఎస్‌పై లగచర్లవాసులు అంతే అభిమానాన్ని చాటుకున్నారు. ఒక్కొక్కరు రూ.1000 చొప్పున చందాలు వేసుకున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రూ.లక్ష విరాళం అందజేసి గులాబీ జెండాపై తమ గుండెల్లో ఉన్న ప్రేమను చాటుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి తరలివచ్చారు. లక్ష చెక్కును కేటీఆర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

> అధికారంతో విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన నివేదిక చెంపపెట్టు. మూడేండ్లలో మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తది. రేవంత్‌రెడ్డి ప్రైవేటు సైన్యంలాగా ఓవరాక్షన్ చేస్తున్న పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదు. సదరు అధికారులు విరమణ పొందినా, ఏ మూలన దాక్కున్నా పట్టుకొచ్చి హిసాబ్ కిసాబ్ బరాబర్ చేస్తం.
>
> -కేటీఆర్

### రైతుబంధు ఎందుకు పడుతలేదు?

‘కేసీఆర్ ప్రజలను కలువడు..ఆయన కొడుకు, బిడ్డ, అల్లుడికే పదవులిచ్చిండ్రు.. ఫామ్‌హౌస్ నుంచి బయటికి రాడు అని నాడు రేవంత్‌రెడ్డి సొల్లు కబుర్లు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించిండు. నాడు ప్రజలను కలవకున్నా కాలానికి ముందే రైతుబంధు అన్నదాతల ఖాతాల్లో జమైంది. నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందింది. మరి ప్పుడు రేవంత్‌రెడ్డి 24 గంటలు ప్రజలను కలుస్తుంటే రైతుబంధు ఎందుకు పడ్తలేదు? తులం బంగారం ఎందుకు వస్తలేదు? విద్యార్థినులకు స్కూటీలు ఎందుకు ఇస్తలేరు?’ అని కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

### సర్కారు కాదు.. సర్కస్ నడుపుతున్నరు

‘కాంగ్రెస్ పార్టీకి ఓ విధానం లేదు. పద్ధతి లేదు. ముఖ్యమంత్రి ఓ మాట చెప్తే మంత్రులు మరో మాట అంటరు. పథకాల ముచ్చటడిగితే పారిపోతున్నరు. వీళ్లు సర్కారును నడుపుమంటే సర్కస్‌ను నడుపుతున్నరు’ అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే లంకెబిందెల కోసం దేవులాడిన వ్యక్తి మన ముఖ్యమంత్రిగా ఉండడం దౌర్భాగ్యమని దెప్పిపొడిచారు. ‘ఆయనలో ప్రజలు అపరిచితుడిని చూస్తున్నరు. రెమో పాత్రలో ఉద్యోగాలకు జీతాలిచ్చేందుకు పైసల్లేవంటరు. మళ్లోసారి వాళ్లను ఎవరూ నమ్ముతలేరంటరు. రాము పాత్రలో లక్షల కోట్లు పెట్టుబడులు తెస్తున్నమంటరు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీని పునరుద్ధరిస్తమంటరు’ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

> బీఆర్ఎస్ రజతోత్సవ సభను బ్రహ్మాండంగా నిర్వహిస్తం.. కాంగ్రెస్, బీజేపీ ఆడుతున్న దొంగనాటకాన్ని ఎండగడుతం.. చేతగాని రేవంత్ సర్కార్ తీరును ప్రజలకు వివరిస్తం. రెండుసార్లు అధికారమిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్తం. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలపై ప్రచారం చేసుకోవడంలో విఫలమైనం.. అందుకే అధికారానికి దూరమైనం.
>
> - ఓ మీడియా చానల్ ఇంటర్వ్యూలో కేటీఆర్

### ఎన్‌రోల్‌మెంట్ చేయలేదు కాబట్టే..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ ఎన్‌రోల్‌మెంట్ చేయనందునే ఎన్నికలకు దూరంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టంచేశారు. ఎన్నికల్లో పోటీ చేయకుంటే పోయేదేమీ ఉండదని చెప్పారు. కొన్నిసార్లు వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల్లో బలవంతంగా పోటీచేసి ఓడిపోయారని, కానీ జనరల్ ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజార్టీతో అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. తాము ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకున్నా స్థానిక ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటామని స్పష్టంచేశారు.

### విభేదాలు ప్రతిపక్షాల సృష్టే

‘బీఆర్ఎస్‌లో విభేదాలు, హరీశ్‌రావును దూరం పెడుతున్నారు అనేది అవాస్తవం’ అని కేటీఆర్ కొట్టిపారేశారు. పనికిమాలిన మీడియా, పనికిరాని కాంగ్రెస్, బీజేపీలే ఇలాంటి అపోహలకు తెరలేపుతున్నాయని మండిపడ్డారు. గులాబీ సైనికులమంతా కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తామని పునరుద్ఘాటించారు. మూడేండ్లు ప్రజాసమస్యలపై పోరాడి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కంకణబద్ధులమవుతామని తేల్చిచెప్పారు.

## లోకం పోకడ




మంచి చాన్స్‌సార్.. రైస్ మిల్లులన్నిటినీ బార్‌షాపులుగా మార్చేద్దాం!

## ఇంకెక్కడి ఫార్మాసిటీ?

మొదటిపేజీ తరువాయి...

ఫార్మా ఉంటే మల్‌రెడ్డి రంగారెడ్డి గతంలో కంటే మీకు ఎక్కువగా అండగా ఉంటడు..’ ఇదీ ఫార్మా సిటీపై సాక్షాత్తూ అధికార కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు. యాచారం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన భూభారతి అవగాహన సదస్సు వేదికగా అధికారికంగా ఆయన ఈ మేరకు కుండబద్దలు కొట్టారు. అయితే, ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఫార్మా సిటీ రద్దుపై ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని లిఖితపూర్వకంగా సమాధానం చెప్పింది. కానీ అధికార పార్టీ ఎమ్మెల్యే మాత్రం అసలు ఫార్మా సిటీ ఇంకా ఉందనుకోవడం భ్రమ అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఫార్మా రైతులతోనే కాదు, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంతోనూ ప్రభుత్వం దోబూచులాడుతున్న దని దీన్నిబట్టి స్పష్టమవుతున్నది.

### రైతు భరోసా రావట్లే...

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండల కేంద్రంలో ఉన్న సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫార్మా రైతులు ఆందోళనలు చేస్తారేమోనని పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ముందుగానే రైతులతో మాట్లాడారు. సమావేశంలో ఎలాంటి ఆందోళన చేయొద్దని, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు నేరుగా ఆయనతో మాట్లాడిస్తానని హామీ ఇచ్చి వారిని బయటకు తీసుకెళ్లారు. సమావేశానికి ముఖ్య అథితిగా వచ్చిన ఎమ్మెల్యేను రైతులు ఫంక్షన్ హాల్ బయటే చుట్టుముట్టారు. రెవెన్యూ రికార్డుల్లో తమ భూములు టీజీఐఐసీ పేరిట ఉన్నాయని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఫార్మా సిటీని రద్దు చేసి, తమ భూముల్ని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. 2,250 ఎకరాలను ఆన్‌లైన్‌లో రైతుల పేర్ల మీదికి ఎక్కించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో లేనప్పటికీ రైతుబంధు, రైతు బీమా, పంట నమోదు పక్రియ కొనసాగిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు రైతు భరోసా అందడం లేదని వాపోయారు. తాము భూములను సాగు చేసుకుంటున్నా రికార్డుల్లో మాత్రం ఎలాంటి పంటలు వేయనట్టుగా చూపిస్తున్నారని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకుడు కానమోని గణేశ్ వివరించారు. రైతులు చెప్పినదంతా విన్న ఎమ్మెల్యే... ఈ సమస్యపై సమావేశంలో మాట్లాడుకుందామని రైతుల్ని లోపలికి తీసుకువెళ్లారు.

### రైతు సమస్యలపై మౌనం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమావేశంలో మాట్లాడుతూ.. అసలు ఫార్మా సిటీ లేదని పేర్కొన్నారు. ఫార్మా సిటీ ఉన్నదనే భ్రమ నుంచి రైతులు బయటకురావాలని సూచించారు. అయితే, రైతుల సమస్యలపై మాత్రం పల్లెత్తు మాట మాట్లాడలేదు. ఆన్‌లైన్‌లో తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, అదీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే చేపట్టాలని రైతులు కోరగా.. అసలు ఆ అంశాన్నే ఎమ్మెల్యే ప్రస్తావించలేదు. ‘ధరణి, గత ప్రభుత్వం’ అంటూ సుదీర్ఘ ప్రసంగం చేసి, అసలు విషయాలను ప్రస్తావించకుండానే ప్రసంగాన్ని ముగించారు. దీంతో రైతులు తమ సమస్య పరిష్కారం మాటేమిటని అడుగుతుండగా ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## సర్కారుకు చెంపపెట్టు

లగచర్ల బాధితుల గోడు, బీఆర్ఎస్ పోరాట ఫలితంగా ఎన్‌హెచ్చార్సీ క్షేత్రస్థాయిలో పర్యటించిందని, బాధితులతో మాట్లాడిందని, వివరాలు ఆరా తీసిందని కేటీఆర్ తెలిపారు. అన్ని అంశాలపై కమిషన్ తాజాగా సమర్పించిన నివేదిక అధికార మదంతో విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అని అభివర్ణించారు. రేవంత్‌రెడ్డి అల్లుడిదని చెప్పుకొంటున్న ఫార్మాస్యూటికల్ కంపెనీ కోసం పేదల భూములు గుంజుకునే ప్రయత్నాన్ని సైతం ఎన్‌హెచ్చార్సీ అభిశంసించిందని గుర్తుచేశారు. ‘రేవంత్ ముఖ్యమంత్రి.. హోంమంత్రిగానే కాదు స్థానిక కొడంగల్ ఎమ్మెల్యేగా ఈ ఘటనపై సిగ్గుపడాలి.. హోంమంత్రిగా పోలీసులు చేసిన దౌర్జన్యానికి ముక్కు నేలకు రాయాలి. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి’ అని డిమాండ్ చేశారు. లగచర్లలో పోలీసుల పాశవిక చర్యల మీద బీఆర్ఎస్ చెప్పిన ప్రతిమాటా అక్షర సత్యమన్న సంగతి ఎన్‌హెచ్చార్సీ నివేదికతో స్పష్టమైందని వివరించారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపిన కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ఇంకా బెదిరిస్తున్నరు

కోర్టు చెప్పినా ఇంకా మమ్మల్ని బెదిరిస్తున్నరు. ఇప్పుడైతే 20 లక్షలు ఇస్తం.. లేదంటే రూపాయి కూడా ఇయ్యకుంట గుంజుకుంటం అంటున్నరు. పోలీసులు బెదిరిస్తున్నరు. ఊర్లో ఉండాలన్నా ఇంకా భయమైతాంది. కొత్త మనిషిని చూస్తే వణుకు పుడుతాంది. ఏం చేసినా మా భూమిని మాత్రం ఇచ్చేది లేదు.

– సురేశ్, లగచర్ల

## భూమిచ్చి ఎటుపోవాలె?

నాకు భర్త లేడు. ఉన్నది మూడున్నర ఎకరాల భూమి. ఇద్దరు కొడుకులకు చెరి సగం పంచిన. కొంచం భూమిని నేను ఉంచుకున్న. దాంట్ల ఎవుసం చేసి వచ్చే గాసంతోనే ఎల్లదీసుకుంటున్నం. ఆ భూమి పోతే మేం ఎటుపోవాలె? మా ఊర్లె రెడ్లకు 20 నుంచి 30 ఎకరాలున్నయ్. వాళ్ల భూములను వదిలి మామీద ఎందుకు పడుతున్నరు? వాళ్ల భూములనే తీస్కోండ్రి. మమ్ములను వదిలెయ్యిండ్రి.

– సక్రుబాయి, లగచర్ల

# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు

- విచారణ పేరిట అడ్డగోలుగా వేధింపులు
- సీఎంవో ప్రోద్బలంతోనే ఇబ్బందులు
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, దురాగతాలను ప్రశ్నించే వారిపై రేవంత్‌రెడ్డి సర్కారు అక్రమ కేసులు బనాయిస్తున్నదని, విచారణ పేరిట అడ్డగోలుగా వేధిస్తున్నదని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ధ్వజమెత్తారు. 9 రోజుల్లో తనకు నాలుగుసార్లు నోటీసులివ్వడం కాంగ్రెస్ సర్కారు కక్ష సాధింపునకు నిదర్శనమని, ఇదంతా ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) ప్రోద్బలంతోనే జరుగుతున్నదని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కంచ గచ్చిబౌలి కేసులో ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరయ్యాయని, తొలిరోజు అడిగిన 66 ప్రశ్నలకు సమాధానమిచ్చానని స్పష్టం చేశారు. అయినప్పటికీ రెండోసారి, మూడోసారి విచారణకు పిలిచి పొద్దంతా ఠాణాల్లో కూర్చుబెట్టి పంపించారని మండిపడ్డారు. మళ్లీ బుధవారం విచారణకు రావాలని నాలుగోసారి పిలవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తప్పులను ప్రశ్నించినందుకు తనపై 21 అక్రమ కేసులు బనాయించిన పోలీసులు.. మంగళవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో



మీడియాతో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్

మరో కేసు నమోదు చేశారని, వారిచ్చిన నోటీసులను చూస్తే ఆశ్చర్యమేసిందని తెలిపారు. నిరుడు మార్చి 31న గాంధీభవన్‌లో వైస్ ప్రెసిడెంట్ కుమార్‌రావు వేసిన కేసులో ఏడాది తర్వాత నిద్రలేచి నోటీసులు ఇవ్వడం సర్కారు దుర్మార్గాలకు పరాకాష్ట అని నిప్పులు చెరిగారు.

### ఫ్రాడ్ కంపెనీతో ఒప్పందంపై పోస్టులు పెట్టడం తప్పా?

‘ఊరూ పేరూ లేని అక్రమ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం తప్పా? గతంలో ఆ కంపెనీకి ఏపీలో 60 ఎకరాలు ఇచ్చారనే సాకుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తుంటే ఊరుకోవాలా? గ్రూప్-1లో జరిగిన అవకతవకలను ఆధారాలతో ఎత్తిచూపితే చట్ట ఉల్లంఘన అవుతుందా?’ అని క్రిశాంక్ సూటిగా ప్రశ్నించారు. ఎన్నికేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపబోమని తేల్చిచెప్పారు. పోలీసులు ఇస్తున్న నోటీసుల్లో నిజాయతీ ఉండటంలేదని, బీఎన్ఎస్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఐపీఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం దుర్మార్గమని విమర్శించారు. నోటీసుల్లోనూ సోషల్ మీడియాకు బదులు ‘సోడా మీడియా’ అని రాయడం చూస్తే సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే అక్రమ కేసులు నమోదవుతునట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు.

### రజతోత్సవాన్ని భగ్నం చేసేందుకు కుట్రలు

ఈ నెల 27న ఎల్కతుర్తిలో అట్టహాసంగా నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవాన్ని భగ్నం చేసేందుకు సర్కారు కుట్రలు పన్నుతున్నదని, ఆ సభ ఏర్పాట్లలో నిమగ్నమైన తనలాంటి అనేక మంది నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నదని క్రిశాంక్ ధ్వజమెత్తారు. చట్టాన్ని గౌరవించి ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరయ్యానని, నాలుగోసారి ఎట్టిపరిస్థితుల్లో వెళ్లేదిలేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టినా ఖాతరు చేయబోనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాల గొంతునొక్కడం ఆపి ప్రజా సమస్యల పరిష్కారం, పథకాల అమలుపై దృష్టిపెట్టాలని హితవు పలికారు.

## హెలికాప్టర్లకు కోట్లు.. ‘ఫీజు’లకు తూట్లు!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని సర్కార్
- కరెంటు బిల్లు కట్టలేని స్థితిలో కాలేజీలు
- ఆత్మహత్యల బాటలో యాజమాన్యాలు
- అమ్మకానికి పలు విద్యాసంస్థలు
- సర్కార్ వైఖరిపై రాకేశ్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): కేవలం 100 కిలోమీటర్ల దూరానికే హెలికాప్టర్లు వినియోగిస్తూ కోట